## క్లుప్తంగా

### విద్యార్థినికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

కడప కల్చరల్: జిల్లాకు చెందిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని ఉన్నత చదువుల కోసం కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థికసాయం అందించింది. ఒంటిమిట్ట మండలం కొండమాచుపల్లెకు చెందిన పుత్తా శివహాసిని ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో 583 మార్కులు సాధించింది. తల్లి అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్ విద్య కోసం బాసట సంస్థను ఆశ్రయించింది. బాసట సభ్యులు వై.మంజులరెడ్డి, జయంతి ద్వారా హర్షితారెడ్డి, అఖిల్‌రెడ్డి రూ.25 వేల చెక్కును విద్యార్థికి అందజేశారు. ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇతరులకు సాయం చేసే స్థితికి ఎదగాలని హితవు పలికారు. శివ హాసిని తల్లి, కుటుంబ సభ్యులు దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

### నూతన మంత్రికి సన్మానం


సత్యకుమార్‌ను సత్కరిస్తున్న మురళీమోహన్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ధర్మవరం బీజేపీ ఎమ్మెల్యే సత్య కుమార్‌ను ఏపీ బీజేపీ నాయకుడు కందుల మురళీమోహన్‌రెడ్డి బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కందుల మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సత్యకుమార్ తనకు కేటాయించే శాఖకు అన్ని విధాలా న్యాయం చేయగలరన్నారు. రాష్ట్రాభివృద్ధికి తన వంతుగా తోడ్పాటు అందించగలరని తెలిపారు.

### పైపులైన్‌కు మరమ్మతులు


మరమ్మతుల అనంతరం ఇలా..

కడప కార్పొరేషన్: కడప నగరం మద్రాస్ రోడ్డులో ఆర్కే నగర్ సమీపంలోని మారుతీ సుజుకీ షోరూం ఎదుట ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగు నీరు వృథాగా పోయింది. ఈ విషయాన్ని ఈనెల 7వ తేదీన ×పైపులైన్ లీకేజీ€ పేరుతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు.

### ఏపీ ఈఏపీసెట్‌లో ప్రతిభ


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్: జేఎన్‌టీయూ విడుదల చేసిన ఏపీఈఏపీ ఫలితాల్లో కడప నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంజినీరింగ్ అండ్ అగ్రికల్చర్, ఫార్మసీ పోటీ పరీక్షలో ప్రతిభ చాటారు. బృంద 438వ ర్యాంకు, హాసిని 536, సుస్మిత 598, సారా ఖానమ్ 679, హితేష్‌రెడ్డి 868వ ర్యాంకులను సాధించారు. వారిని డీజీఎం రామ్మోహన్‌రెడ్డి, కోర్ డీన్ చంద్ర కిషోర్‌రెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, మురళీమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, సుమన్, తదితరులు అభినందించారు.

### యువత రక్తదానం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న హిదాయత్ అలీఖాన్, తదితరులు

కడప ఎడ్యుకేషన్: యువకులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలనిలని ముస్లిం స్వర్ణకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు హిదాయత్ అలీఖాన్ అన్నారు. జూన్ 14న రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సీనియర్ సభ్యులు రాయల్ కరీముల్లా ముద్రించిన కరపత్రాలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో గోరుగోల్డ్ సుబ్బారెడ్డి, బాష తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : అనంతపురం జేఎన్‌టీయూ విడుదల చేసిన ఎంసీఏ, ఎంబీఏ ఫలితాల్లో కడప రిమ్స్ రోడ్డులోని స్పిరిట్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎంసీఏ విభాగంలో వాసవి 92.6 శాతం, షకీన 91 శాతం, ఎర్రస్వామి 90.4 శాతం మార్కులతో కళాశాల ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. అలాగే ఎంబీఏ విభాగంలో సతీష్‌కుమార్ 87.5 శాతం . శిరీష 86.5 శాతం, ముహిసిన 86.2 శాతం మార్కులతో టాపర్స్‌గా నిలిచారు. విద్యార్థులను కళాశాల అధినేత నిర్మల, శ్రీకాంత్‌కుమార్, రవీంద్ర అభినందనలు తెలిపారు.

# వర్షం కష్టాలు.. వర్ణనాతీతం

కడప కార్పొరేషన్/కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలో బుధవారం కురిసిన వర్షాలకు ఆర్టీసీ బస్టాండు ప్రాంతం జలమయమైంది. నగరంలోని మురుగు కాలువలు పొంగి ప్రవహించడంతో ఆర్టీసీ బస్టాండు చుట్టు ప్రక్కల ప్రాంతాలు జలమయంమయ్యాయి.

ఆర్టీసీ బస్టాండు, జిల్లా కోర్టు, ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం, ఆర్టీసీ బస్టాండు ఔట్ గేట్, కోటిరెడ్డి సర్కిల్ ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు నిలవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. డ్రైనేజీ కాల్వ నిర్మాణం అసంపూర్తిగా ఉండడం, పూర్తయిన చోట మట్టికుప్పలు ఉండడంతో వరద నీరు ఎటూ పోలేక నిలిచిపోయింది. నగర శివారు ప్రాంతాల్లో మట్టి దారులు బురదమయమయ్యాయి.


కడప ఆర్టీసీ బస్టాండులో నిలిచిన వర్షపు నీరు


ఫక్కీరుపల్లె మార్గంలో నిలిచిన వాననీరు


గురుకుల్ విద్యాపీఠం వెనుక వర్షపు నీరు


ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం ఎదుట వరద నీరు

## ఆర్‌జెడీ కార్యాలయం ఎదుట విద్యార్థుల నిరసన

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ వ్యాప్తంగా గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌వైఎఫ్, టీఆర్‌ఎస్‌ఎఫ్, ఆర్‌ఎస్‌ఏ, ఆర్‌వీఎఫ్ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. కడపలోని ఇంటర్ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘ నేతలు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు లేని కళాశాలలను అరికట్టడంలో ఆర్‌ఐవోలు విఫలమయ్యారన్నారు. కార్పొరేట్ యాజమాన్యాలు ఎలాంటి అనుమతులు లేకుండానే హాస్టల్స్ నిర్వహిస్తున్నాయన్నారు. ఆర్‌ఐవోలకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవని ఆరోపించారు. అధికారులు స్పందించి రాయలసీమ వ్యాప్తంగా ఉన్న సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

ఈ కార్యక్రమంలో ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, తెలుగు రాష్ట్ర విద్యార్థి సమైఖ్య రాష్ట్ర కార్యదర్శి ఇండ్ల జయరాజ్, రాయలసీమ విద్యార్థి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ ఆర్‌వీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైభవం..ఎదురుకోళ్ల ఉత్సవం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్య మఠం, కొండావధూత ఆశ్రమంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం జరగనున్న కల్యాణం సందర్భంగా బుధవారం రాత్రి ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఎదురుకోళ్లు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు పెళ్లిపెద్దలుగా ఉండి ఎదురుకోళ్లు తంతును శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం ఆలయంలో చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, ఉత్సవబలి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్వామివారికి పవిత్రజలాలతో గంగానయనం కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## జిల్లాలో ఫాదర్ కంబ్లిష్ బహుముఖ సేవలు

కడప కల్చరల్: జిల్లాలో క్రైస్తవ పితామహుడిగా పేరుగాంచిన ఫాదర్ కంబ్లిష్ సేవలు అందించారని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మడగలం ప్రసాద్ అన్నారు. ఫాదర్ కంబ్లిష్ 55వ వర్ధంతి సందర్భంగా బుధవారం మరియాపురంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాదర్ కంబ్లిష్ మరియాపురం నిర్మాతగా, పేద బడుగులకు విద్య, వసతి, ఉపాధి తదితర సేవలందించారన్నారు. కేథలిక్ క్రైస్తవ బీజాలు నాటిన వ్యక్తి అని, కథోలిక విశ్వాసులు ఆయనను మరువలేరని అన్నారు. రాయలసీమ లాంటి కరవు ప్రాంతంలో పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అందించారన్నారు. కంబ్లీష్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ప్రజల ఆదరభిమానాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అయ్యూరి అబ్రహాం, ఉపదేశి గ్రగోరి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న భక్తులు

## 15న కడపలో జోస్ అలుక్కాస్ జ్యువెల్లరీ షాప్ ప్రారంభం

కడప: బంగారు నగల దుకాణంలో పేరొందిన జోస్ అలుక్కాస్ నగల దుకాణం కడపలో ఈనెల 15న ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ ఆకృతుల నగలతో ప్రారంభించిన ఈ షాప్‌ను ప్రముఖ నటి ప్రారంభిస్తారని తెలిపారు.

## నీట్ పరీక్షలో అవకతవకలపై న్యాయ విచారణ జరపాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నీట్ పరీక్షల్లో అక్రమాలపై న్యాయ విచారణ జరపాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం.ఓబులేసు యాదవ్ పేర్కొన్నారు. నగరం లోని అంబేడ్కర్ సర్కిల్‌లో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ నీట్ యూజీ–2024 ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, దీనిలో ఏడుగురు హర్యానాకు చెందిన ఒకే ఎగ్జామ్ సెంటర్ వారు కావడం అనుమానాలకు దారి తీయడం వెనుక బీజేపీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. హర్యానాలోని ఓ సెంటర్‌లో ఎగ్జామ్ రాసిన జాన్వి 179 ప్రశ్నలకు సమాధానం రాయగా, 163 కరెక్ట్ అయ్యాయి. ఆమెకు 636 మార్కులు రావాల్సి ఉన్నా.. 720/720 ఎలా వచ్చాయో తెలియదన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి న్యాయ విచారణ జరిపి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్లబాబు, పప్పుశెట్టి రెడ్డిసాయి, నాయకులు నవీన్, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

**అక్రమాలపై వెంటనే విచారించాలి**

కడప ఎడ్యుకేషన్ : నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని అప్సర సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 విద్యా సంవత్సరంలో మెడికల్ విద్య అభ్యసించేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షా ఫలితాలను హడావుడిగా విడుదల చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, నగర అధ్యక్షుడు హరిబాబు, ఆర్‌ఎస్‌యూ నాయకులు కుమార్, సందీప్, శ్యాసుందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


కడప అప్సర సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ఆర్‌ఎస్‌యూ నాయకులు

## కార్యకర్తల కష్టాల్లో పాలు పంచుకుంటాం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


సమావేశానికి హాజరైన వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు

వీరపునాయునిపల్లె : మండలంలోని ప్రతి కార్యకర్త కష్టాల్లో పాలు పంచుకుంటానని కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వ్యవసాయక్షేత్రంలో బుధవారం ఆయన కార్యకర్తలతో సమావేశం నిరన్వహించి మాట్లాడారు.

ఈనెల 4వ తేదీన వెలువడిన ఎన్నికల ఫలితాల్లో మన పార్టీ ఓటమికి గురైందని ఏ ఒక్కరు కూడా కుంగిపోవద్దని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయామే కాని ప్రజల సంక్షేమ కొరకు పోరాటాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా వెంటనే నాదృష్టికి తీసుకువస్తే వెంటనే ఆ సమస్యను పరిష్కరించేందుకు ముందుంటానని తెలిపారు. 24 గంటలు నా సెల్‌ఫోన్ ఆన్‌లోనే ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త నేరుగా ఫోన్‌చేసి సమస్యను తెలుపవచ్చన్నారు. ఏ గ్రామంలోనైనా మన పార్టీ కార్యకర్తకు, నాయకుడికి సమస్య ఎదురైతే మనమందరమూ ఐకమత్యంగా పోరాటం చేయాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు ఏవైనా రావాల్సి ఉంటే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి బిల్లులు అందేలా చేస్తానన్నారు. ఇటీవల అసైన్‌మెంటు కమిటీలో అమోదం పొందిన ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకం అందించేలా కృషి చేస్తామన్నారు. సర్వరాయ సాగర్ ద్వారా రైతుల పంటపొలాలకు ఇబ్బందులు కలుగకుండా నీరు విడుదల చేయించడంలో ప్రధాన పాత్ర సోషించడం జరుగుతందని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, మండల పరిశీలకుడు రాజు పాలెం జగన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అధైర్య పడవద్దు అండగా ఉంటా**

పెండ్లిమర్రి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేదని ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. కడప నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పెండ్లిమర్రి మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలలో ఓటమి ఎదురు కావడంతో టీడీపీ దాడులకు తెగబడుతున్నదన్నారు. దాడులకు భయపడకుండా అందరూ కలిసికట్టుగా ఉండి ధైర్యంగా దాడులను ఎదుర్కోవాలన్నారు. ఏదైనా సమస్య వస్తే పార్టీ నేను కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూసార పరీక్ష.. పుడమికి రక్ష

- పరీక్షలతో నేల స్వభావంపై కచ్చితమైన అంచనా
- ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం
- భూసారం పెంపొందేందుకు చర్యలు
- తగ్గనున్న పంటల సాగు ఖర్చు అధిక దిగుబడులకు అవకాశం

ఎర్రగుంట్ల : వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని నిపునులు పేర్కొంటున్నారు. సాగు భూమిలో భూసార పరీక్షలు చేయించడం నేలలోని పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార, స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. అలాగే ఏ ఎరువులు అనవసర వ్యయం, గణనీయంగా తగ్గుతుంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలను అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంత మంది అన్నదాతలు రసాయన ఎరువులు, పురుగుమందులు, అవసరానికి మించి వినియోగిస్తుండటంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడుబారడంతో పాటు చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

**నమూనాల సేకరణలో జాగ్రత్తలు..**

పంటకోత పూరైన తర్వాత, వేసవి పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు సేకరించాలి. పొలాలకు సాగునీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తర్వాత మట్టి నమూనాలు సేకరించకూడదు. పొలాల్లో నీడ పడే ప్రదేశాలు, గట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయకూడదు. ముందుగా నేలపైన ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసి వేయాలి. వరి పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పైపార నుంచి కింది వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి. వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో భాగ కలిపి అరకేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తర్వాత పాలిథిన్ కరవ్‌లో నింపి రైతు వివరాలు, సర్వే నంబర్ విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్ష కేంద్రాలకు పంపుతారు. వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పండ్ల తోటలకు మూడు అడుగుల లోతులో ప్రతి అడుగుకు ఒక నమూనా, చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతుతో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.


భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

**భూసార పరీక్షలు ఎంతో మేలు..**



భూసార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దాని అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

శ్రీకాంత్‌రెడ్డి (వ్యవసాయ అధికారి ఎర్రగుంట్ల మండలం)

## చిన్నారులతో పనులు చేయించడం నేరం

కడప కోటిరెడ్డిసర్కిల్: చిన్నారులతో దుకాణదారులు, ఇతర సంస్థల యాజమానులు పనులు చేయించడం చట్ట రీత్యా నేరంగా గుర్తించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్ తెలిపారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాసాపేట పరిధిలోని ఆటో గ్యారేజ్, పెట్రోల్ బంకులు, దుకాణాలు ఇతర యజమానులను నిర్బంధిత కార్మికులరక్షణ, పునరావాసం అంశంపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ షాపులు, సంస్థల యాజమాన్యాలు వయస్సు ధృవీకరణ పత్రాలు తీసుకుని కార్మికులను నియమించుకోవాలన్నారు. అలాగే ఉచిత న్యాయ సహాయం అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, కార్మిక శాఖ అధికారులు మునిస్వామి, శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్, ఎల్‌పీఓ సునీత, పారా లీగల్ వలంటీర్లు శ్రీనివాసులు, విష్ణు, పోలీసులు, కార్మికులు పాల్గొన్నారు.


బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు, అధికారులు

## యాత్రికులపై ఉగ్రవాదుల చర్య అమానుషం

కడప కల్చరల్: జమ్ము కశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయం నుంచి శివ్‌ఖోడికి వెళ్తున్న హిందూ భక్తుల బస్సుపై ఇస్లామిక్ జిహాదీ ఉగ్రవాదుల దాడి అమానుషమని వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామ మహేష్, జిల్లా సహ కార్యదర్శి చిక్కన్న అన్నారు. ఉగ్ర దాడిలో పది మంది ప్రాణాలు కోల్పోయినందున, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఆర్వోకు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆర్టికల్ 370ని తొలగించాక ప్రశాంత వాతావరణం ఏర్పడిందని, ఉగ్రవాదుల దుడుకు చర్యలు మాత్రం తగ్గలేదన్నారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే సమయంలో ఈ సంఘటన దేశ సార్వభౌమాధికారానికి సవాలుగా నిలుస్తోందన్నారు. ఇలాంటి అంశాలను ప్రోత్సహించే అంతర్గత విదేశీ సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, సహ కార్యదర్శి సురేంద్ర, భజరంగ్‌దళ్ సహ సంయోజక్ అమర్, హిందూ పరిరక్షణ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


డీఆర్వోకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రతినిధులు

## జ్ఞానపీఠానికి గౌరవం తెచ్చిన కవి సినారె

కడప కల్చరల్: దేశ సాహిత్య రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠం పురస్కారానికి ప్రముఖ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి గౌరవం తెచ్చారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ సి.నారాయణ రెడ్డి వర్ధంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులతో కలిసి డాక్టర్ సి.నారాయణ రెడ్డి చిత్రపటానికి పూల మాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణరెడ్డి విశ్వంభరం కావ్య రచనతో జ్ఞానపీఠ పురస్కారం పొందడమేగాక, తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించారన్నారు. కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ తెలుగు సినీ పాటల రచయితగా ఆచార్య నారాయణరెడ్డికి గొప్ప పేరుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతకుంట శివారెడ్డి, రమేష్‌రావు, ఆర్.వెంకటరమణ, సి.నీలకంఠేశ్వర్, హరికృష్ణ పాల్గొన్నారు.


సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

## బ్రౌన్ గ్రంథాలయానికి మహాభారత గ్రంథాలు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల సుధారాణి బుధ వారం స్థానిక యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి మహాభారత గ్రంథాలను అందజేశారు. తన భర్త రిటైర్డ్ జిల్లా జడ్జి బొక్కసం వెంకటరమణ స్మారకంగా తిరుమల–తిరుపతి దేవస్థానాలు ప్రచురించిన ఆంధ్ర మహాభారతం 18 పర్వాలను బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డికి ఆమె అందజేశారు. రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచుతామన్నారు. వైవీయూ వీసీ ఆచార్య చింతాసుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య పుస్తక దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆకుల కిశోర్‌బాబు, మహతి, ఎం.నాగరాజు, డాక్టర్ సి.శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మహాభారత గ్రంథాలు అందజేస్తున్న సుధారాణి

## ఘనంగా వార్షికోత్సవ వేడుక

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజల అవసరాలు తీరుస్తూ నమ్మకానికి మారుపేరుగా నిలుస్తున్న మహా జనని చిట్స్ కడప ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 9వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలోని సంస్థ కార్యాలయంలో తొలుత ఎండీ బాలకృష్ణ కేక్ కట్ చేసి సంస్థ ఉద్యోగులతో పాటు తమకు అన్ని విధాల తోడ్పాటు అందిస్తున్న ఖాతాదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా జనని చిట్స్ సంస్థ అతి తక్కువ కాలంలో ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించడాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఖాతాదారుల ప్రయోజనాలను ఆశిస్తూ సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం మరింత అభినందనీయమన్నారు. అనంతరం సంస్థ డైరెక్టర్లు అమర్‌నాథరెడ్డి, శివశంకర్‌రెడ్డిలు రాబోయే సంస్థ నూతన ఫ్యూచర్లను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితోపాటు ఖాతాదారులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న సంస్థ ఎండీ బాలకృష్ణ, సిబ్బంది